# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్ - సైప్రస్ దేశాల మధ్య బలమైన స్నేహ సంబంధాలున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతలను అనుసంధానించడం ద్వారా సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- పది రాష్ట్రాలలోని 24 రాజ్యసభ స్థానాలకు జరిగే ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది.
- ఐపీఎల్ లో భాగంగా హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్-సైప్రస్ దేశాల మధ్య బలమైన స్నేహ సంబంధాలున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు, సాంకేతికత, ఉన్నత విద్యా పరిశోధన, సాంస్కృతిక సహకారంపై ఒక సంయుక్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడంతో సహా పలు రంగాలలో పరస్పర సహకారం కోసం భారత్ సైప్రస్ దేశాలు న్యూఢిల్లీలో ఈరోజు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంలో సైప్రస్ నుండి భారత్‌కు వచ్చే పెట్టుబడులు దాదాపు రెట్టింపు అయ్యాయని అన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పెట్టుబడులను రెట్టింపు చేయాలని భారత్, సైప్రస్ లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. గత ఏడాది కాలంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయమైన పురోగతిని సాధించాయని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ అన్నారు.

(వాయిస్…27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పది రాష్ట్రాలలోని 24 రాజ్యసభ స్థానాలకు జరిగే ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకల నుంచి ఖాళీ అవుతున్న పన్నెండు స్థానాలకు.. అలాగే.. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఆరు స్థానాలకు, జార్ఖండ్‌లో రెండు స్థానాలకు, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఒక్కో స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 1వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుంది. జూన్ 18వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు కూడా అదే రోజున చేపడతారు.

= = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) వ్యవస్థలో ఆధునిక సాంకేతికతలను అనుసంధానించడం ద్వారా సరిహద్దు భద్రతా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన బీఎస్ఎఫ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దేశ సరిహద్దును మరింత దుర్భేద్యంగా

మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌లో డ్రోన్‌లు, రాడార్లు, కెమెరాలు, ఇతర సాంకేతిక వనరులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దేశంలో సమగ్రమైన, ఏకీకృత భద్రతా వ్యవస్థ ఉండాల్సిన అవసరాన్ని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర సాయుధ దళాలు, నిఘా సంస్థలు, స్థానిక పరిపాలన మధ్య మరింత సమన్వయం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. 1965లో 25 బెటాలియన్లు, పరిమిత వనరులతో ప్రారంభమైన బీఎస్ఎఫ్ ఈ రోజున దాదాపు రెండు లక్షల 70 వేల మంది సిబ్బందితో ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా అవతరించిందని హోం మంత్రి తెలిపారు.

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా వయోవృద్ధుల కోసం సహాయక వ్యవస్థలను బలోపేతం చేయడానికి జీవన్ (జాయింట్ ఎల్డర్లీ ఎంపవర్‌మెంట్ అండ్ వర్చువల్ అసిస్టెన్స్ నెట్‌వర్క్) అనే మొబైల్ అప్లికేషన్‌ను కేంద్ర సాంఘిక న్యాయ, సాధికారత శాఖా మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. జీవన్' మొబైల్ అప్లికేషన్, వయోవృద్ధుల అవసరాలు ఆందోళనలను పరిష్కరించే లక్ష్యంతో అనేక రకాల ఫీచర్లతో అందిస్తుంది. వీటిలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల సమాచారం, అత్యవసర సహాయం, వృద్ధాశ్రమాల వివరాలు వంటివి ఉన్నాయి. వృద్ధ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్లాట్‌ఫామ్‌ను సరళమైన తీరులో రూపొందించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా రేపు జరగనున్న 19వ 'రోజ్‌గార్ మేళాలో  వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో కొత్తగా నియమితులైన యువతకు 51 వేలకు పైగా నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్య మధ్యమం ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకున్న వారిని ఉద్దేశించి నరేంద్రమోదీ ప్రసంగించనున్నారు. 19వ రోజ్‌గార్ మేళాను దేశవ్యాప్తంగా 47 ప్రాంతాలలో నిర్వహిస్తున్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ఎంపికైన కొత్త అభ్యర్థులు, రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా విభాగం వంటి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల విభాగాలలో చేరనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో గత నాలుగు రోజులుగా దేశ విద్యుత్ డిమాండ్ సరికొత్త రికార్డు స్థాయికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నిన్న పగటిపూట గరిష్ట విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్లుగా నమోదైందని, ఇది గత రికార్డులన్నింటినీ అధిగమించిందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. బుధవారం ఇది 265 గిగావాట్లకు పైగా ఉండగా.. సోమవారం, మంగళవారాల్లో డిమాండ్ వరుసగా 257, 260 గిగావాట్లకు పైగా ఉంది. సాధారణంగా పగటిపూట గరిష్ట డిమాండ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య ఏర్పడుతుందని తెలిపింది. తీవ్రమైన వేసవి కారణంగా అవసరమైన మేరకు విద్యుత్‌ను సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అదే సమయంలో దేశ ప్రజలు విద్యుత్‌ను, పొదుపుగా వాడుకోవాలని  సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు రాష్ట్రాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఛండీఘఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్ లోని తీర ప్రాంతాలలో వేడి వాతావరణం కొనసాగుతోంది. రాగల నాలుగైదు రోజుల పాటు ఇదే తరహా వాతావరణం ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ)

తెలిపింది. ఉత్తర ప్రదేశ్ లో వరుసగా ఐదవ రోజు కూడా, రాష్ట్రంలోని బందా జిల్లాలో దేశంలోనే అత్యధికంగా 47.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ ప్రారంభించి 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 231.99 పాయింట్లు లాభపడి 75 వేల 415 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 64.60 పాయింట్లు పెరిగి 23 వేల 719 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = =

9వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని జూలై 1 నుంచి తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను వచ్చేవారం విచారించేందుకు సుప్రీంకోర్టు ఈరోజు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఈ విషయాన్ని ప్రస్తావించారు.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =